క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి నాబార్డు నిధుల మంజూరు



ఆమిటి-తెర్లాం రోడ్డును పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

తెర్లాం: ఆమిటి-తెర్లాం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నాబార్డు నిధుల నుంచి రూ.1.46 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు శనివారం వచ్చి స్థానిక నాయకులను కలిసి ఆమిటి-తెర్లాం రోడ్డును పరిశీలించారు. కొన్ని నెలల క్రితం ఆమిటి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బేబీనాయన దృష్టికి రోడ్డు సమస్యను స్థానిక నాయకులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన రోడ్డును బాగు చేసేందుకు అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు నిధులు మంజూరు కాగా వీలైనంత త్వరగా పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

రేషన్ షాపు ప్రారంభం



రేషన్ షాపు ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మ

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురంలో కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ షాపును సర్పంచ్ బొద్దల పద్మ శనివారం ప్రారంభించారు. సకాలంలో లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని డీలర్‌కు సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కిశోరి బాలికల వికాసంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నూకాలమ్మ

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో కిశోరి బాలికల వికాసంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నూకాలమ్మ పాల్గొని, బాలికల మెరుగైన ఆరోగ్యానికి సలహాలు, సూచనలు చేశారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం బాలికలకు విద్య ప్రాముఖ్యం, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలు, ఆత్మరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎం.రాధమ్మ పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. ఆలయ అర్చకులు రేజేటి సత్తిబాబుశర్మ, రేజేటి వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, రేగిడి, ఆడవరం, మంగళాపేట, ఆమదాలవలస గ్రామాల్లో త్రైత సిద్ధాతంపై శనివారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాకుళం సభ్యులు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో తిరిగి భగవద్గీత గూర్చి ప్రచారం చేశారు.

వంగర: మండలంలోని కె.కొత్తవలసలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు వేమకోటి రమాకాంత్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సత్వరమే ప్రజాసమస్యలు పరిష్కరించాలి



సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: సత్వరమే ప్రజాసమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో శనివారం సమావేశమైన ఆయన.. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రజలు, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. చిన్నారుల ఆధార్ నమోదు పూర్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు.



రాజాం మండలంలో గడిముడిదాం-సీఎస్ఆర్‌పురం మధ్య రాళ్లుతేలిన రోడ్డు



వంగర మండలంలో ఇరువాడ-చొదరివలస గ్రామాల మట్టిరోడ్డు ఇలా..



రోడ్డు పొడవునా గుంతలతో రేగిడి మండలంలోని ఖండ్యాం-గుళ్లసీతారాంపురం రోడ్డు

అధ్వాన దారులు.. ఎన్నాళ్లీ అవస్థలు!

- అస్తవ్యస్తంగా లింకు రోడ్లు
- ఏ గ్రామం చూసినా గుంతలు, రాళ్లుతేలిన రహదారులే..
- అవస్థలు పడుతున్న జనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

● అస్తవ్యస్తంగా లింకు రోడ్లు
● ఏ గ్రామం చూసినా గుంతలు, రాళ్లుతేలిన రహదారులే..
● అవస్థలు పడుతున్న జనం ● పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రేగిడి: గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏ గ్రామ రహదారి చూసినా అడుగుకో గుంత..గజానికో గొయ్యి మాదిరి కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల లింకు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వర్షం పడితే ఎక్కడ గుంత ఉందో.. ఏది సమతలమో తెలియని దుస్థితి. దీంతో వాహనాలపై వెళ్తున్నప్పుడు ప్రజలు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారు. పాదచారుల పరిస్థితి అయితే చెప్పాల్సినవసరం లేదు. కాళ్లు పుండ్లు అయిపోతున్నాయని, ఒళ్లు హూనమైపోతోందని వాపోతున్నారు. ఎన్నాళ్లీ అవస్థలు అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి రాగానే గుంతలు లేని రోడ్లు.. అద్దంలా మెరిసే రహదారులు వేసి చూపిస్తామన్న నాయకులు ఎక్కడని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు బాగు చేయడంపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

రోడ్డు..కనుమరుగు..

రాజాం మండలంలో మొత్తం 21 పంచాయతీలు ఉండగా, ఏ పంచాయతీలోని గ్రామాలకు పక్కారోడ్లు నిర్మాణం జరగలేదు. గతంలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్‌తో పాటు 14వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు వేసేవారు. ప్రస్తుతం వాటి నిర్మాణం జరగకపోవడంతో చాలా గ్రామాల లింకు రోడ్లు దారుణంగా ఉన్నాయి. ప్రధానంగా దోసరి-రాజాం, గడిముడిదాం-సీఎస్ఆర్‌పురం, పెనుబాక-శ్యాంపురం, బొద్దాం-సోపేరు గ్రామాల మధ్య రోడ్డు సదుపాయం కనుమరుగైంది.

దశాబ్దాలుగా మట్టిరోడ్డే గతి..

వంగర మండలంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల తరబడి పల్లెలకు మట్టిరోడ్లపైనే ప్రజలు నడక సాగించాల్సిన దుస్థితి. ఎన్నికల సమయంలో నేతలు పల్లెలకు వచ్చి హామీలు ఇస్తున్నారే తప్ప రహదారి సదుపాయం కల్పించడం లేదని పల్లె జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చంద్రంపేట-జనార్థనవలస జంక్షన్, ఇరువాడ-చొదరివలస, మరువాడ-సీతాదేవిపురం, కొప్పరవలస జంక్షన్-రుషింగి, కొట్టిశ-కె.కొత్తవలస, మద్దివలస-తలగాం తదితర గ్రామాల లింకు రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కొన్నేళ్లుగా మట్టిరోడ్లుగానే మిగిలిపోయాయి.

తారురోడ్లు అయ్యేదెన్నడో?

రేగిడి మండలంలోని పలు గ్రామాలకు లింకు రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ఏళ్ల తరబడి లింకురోడ్లను తారు రోడ్లుగా మార్చేందుకు అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు చొరవ చూపక పోవడంతో గ్రామీణుల కష్టాలు నేటికీ తీరడం లేదు. మండలంలోని కొర్లవలస-పనసలవలస, కె.వెంకటాపురం-ఖండ్యాం, అక్కన్నఅగ్రహారం-లక్ష్మీపురం, లచ్చారాయపురం-గుళ్లపాడు, గుళ్లపాడు-ఉంగరాడ. సోమరాజుపేట- గుళ్లసీతారాంపురం, అంబఖండి-ఉంగరాడ, వన్నలి-ఉంగరాడమెట్ట గ్రామాల మధ్య రహదారులు అయితే చాలా ప్రమాదకరంగా మారాయి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఆయా రోడ్లలో కనీసం నడవలేని పరిస్థితి.

అరకొరగా పనులు..

సంతకవిటి మండలంలో మొత్తం 34 పంచాయతీలు ఉండగా, ఏ పంచాయతీ పరిధిలోనూ లింకురోడ్లు వేయలేదు. మిర్తివలస-గోవిందపురం గ్రామాల మధ్య లింకురోడ్లు పనులు ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయి నిర్మాణం జరగలేదు. అరకొరగా పనులు చేసేసి, చేతులు దులిపేసుకున్నారు. లింకురోడ్లు నిర్మాణాలు లేక గోవిందపురం, నారాయణరాజుపురం, ఇజ్జిపేట, మల్లయ్యపేట-హొంజరాం, మంతిన-అప్పలఅగ్రహారం తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



అధ్వానంగా సంతకవిటి మండలంలోని మందరాడ-గోవిందపురం గ్రామీణ రోడ్డు

> **నిధులు ఇంకా రాలేదు..**
>
> రేగిడి మండలంలో లింకురోడ్లు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగలేదు. కొన్నిచోట్ల గ్రామాల్లో అంతర్గత రోడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయి. పలు గ్రామాల రహదారుల అనుసంధానానికి తీర్మానాలు చేసి ప్రతిపాదనలు పంపించాం. ఇంకా నిధులు రాలేదు.
>
> -ఆర్.రియాజ్, పీఆర్ జేఈ, రేగిడి మండలం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బొబ్బిలి మండల కేంద్రంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గ్రీన్‌బెల్ట్ సొసైటీ, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి పాల్గొని, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ తమ పరిసరాలు కాలుష్యం కాకుండా చూసుకోవాలని కోరారు. మానవాళికి ప్రాణవాయువును ఇచ్చే చెట్లను కాపాడుకోవాలన్నారు. అందరూ తమవంతు సాయంగా ఓ మొక్కను పెంచి పర్యావరణ సమతుల్యతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి, వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు. -బొబ్బిలి

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. రాజాంలోని వస్త్రపురి కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాన్ని ఆయన శనివారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, అలాగే నిర్మాణ పనుల్లో రాజీ పడొద్దని తెలిపారు. నిర్మాణాల్లో ఎక్కడైనా నాణ్యత లోపించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. -రాజాం సిటీ

పక్కాగా భూముల రీసర్వే



పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దారు కె.సుధాకర్ సూచించారు. బాడంగి మండలంలోని వాడాడ గ్రామంలో శనివారం ప్రారంభమైన రెండో విడత భూముల రీసర్వేను ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులంతా సర్వే సిబ్బందికి సహకరించాలని, దగ్గరుండి హద్దులు చూపించి, సర్వే చేయించుకోవాలన్నారు. ఇదిలా ఉంటే ముందు రోజు రాత్రి సర్వేపై దండోరా వేయించి, మరుసటి రోజు సర్వే చేయడంపై గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 13న గ్రామంలో అమ్మవారి పండగ ఉన్నందున ఆ పండగ తర్వాత సర్వే చేయాలని కోరుతున్నారు. -బాడంగి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!



రామభద్రపురం: విద్యార్థులతో కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి



బొబ్బిలి శాఖా గ్రంథాలయానికి హాజరైన విద్యార్థులు

తెర్లాం/రామభద్రపురం/బొబ్బిలి: శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఓ వైపు వినోదం, మరోవైపు విజ్ఞానం పంచే కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో గ్రంథాలయాలకు వచ్చేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. విద్య, వినోద కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ జ్ఞానసముపార్జన చేస్తున్నారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం



తెర్లాం: తెర్లాంలో కురుస్తున్న వర్షం



బాడంగి మెయిన్‌రోడ్డుపై కురుస్తున్న వర్షం

తెర్లాం/బాడంగి/బొబ్బిలి/వంగర: మండల కేంద్రాలు సహా మండలాల్లోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం శనివారం సాయంత్రం కురిసింది. గాలుల ధాటికి చెట్లు, హోర్డింగ్‌లు, స్తంభాలు నేలకూలాయి. ఇన్నాళ్లు ఉక్కపోతతో అలమటించిన ప్రజలు చల్లనిగాలులు, వర్షం కారణంగా చల్లబడిన వాతావరణంతో ఉపశమనం పొందారు.



బొబ్బిలిలో ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన హోర్డింగ్



బొబ్బిలి ఆర్సీఎం చర్చి వద్ద రోడ్డుపై పడిన చెట్టును నరికివేస్తున్న దృశ్యం

పరామర్శ

బాడంగి: మండలంలోని డొంకినివలస, గజరాయునివలస గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు జి.శంకరరావు, ఎం.భాస్కరరావులను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం పరామర్శించారు. గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీరు విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్దకు ప్రస్తుతం చేరుకుని కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి.. ఆయా గ్రామాలకు వెళ్లి వారిని కలిసి ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అక్కడి నుంచి పాల్తేరు వెళ్లి, నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు వంగపండు వెంకటరమణను కలిసి పరామర్శించారు. ఇటీవల ఆయన తల్లి పార్వతమ్మ చనిపోవడంతో ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యామలి శివప్రసాద్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ ప్రతినిధి గర్బాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: గజరాయునివలసలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రాజాం: వంగర మండల కన్వీనర్ కరణం సుదర్శనరావును వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శనివారం పరామర్శించారు. ఈ నెల 2వ తేదీన ఆయనపై కొంతమంది టీడీపీ నేతలు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్‌కుమార్, డాక్టర్ నరేంద్ర తదితరులు ఉన్నారు.



రాజాం: సుదర్శనరావును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనం వద్ద ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న.. తొలుత జెండా ఆవిష్కరించి, 66 ఏళ్లలో ఏఐవైఎఫ్ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు గుర్తు చేసుకున్నారు. నిరుద్యోగులను నిలువునా మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తమ పోరాటం ఎప్పుడూ ఉంటూనే ఉంటుందని ఆయన అన్నారు.

నేటి నుంచి దాడితల్లి ఉత్సవాలు

బొబ్బిలి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా పేరొందిన దాడితల్లి ఉత్సవాలు స్థానిక పట్టణంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానుండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దైవదర్శనం సులభంగా ఉండేలా ఉత్సవ కమిటీ చర్యలు తీసుకుంది. ఆదివారం తొలేళ్లు, సోమవారం సిరిమానోత్సవం, మంగళవారం అనుపోత్సవంతో పండగ ముగుస్తుంది. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆలయం వద్ద, బైపాస్ రోడ్డులో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.



దాడితల్లి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

సనాతన ధర్మంపై అవగాహన పెంచుకోవాలి

రాజాం సిటీ: విద్యార్థి దశ నుంచే హిందూ సనాతన ధర్మం, ఇతిహాసాలపై అవగాహన పెంచుకోవాలని మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ అన్నారు. గత పది రోజులుగా స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో నిర్వహించిన ప్రజ్ఞ వేసవి శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో మంచి చెడులు తెలుసుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు మార్గం సుగమమవుతుందన్నారు. శిక్షణలో ప్రజ్ఞ దైనందిన శ్లోకాలు, సప్తఋషుల చరిత్రలు, ఇతిహాసాల పరిచయం, నీతిపద్యాలు బోధించినట్లు వికాస తరంగిణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు తెలిపారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

శిక్షణా శిబిరాన్ని సందర్శించిన డిప్యూటీ ఈవో



శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో వెంకటరావు

రాజాం: స్థానిక జవహర్ బాలభవన్‌లో జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని చీపురుపల్లి డిప్యూటీ ఈవో వెంకటరావు శనివారం పరిశీలించారు. 300 మందికి పైగా చిన్నారులు శిక్షణకు హాజరవుతుండడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, తబలా వంటి వాటిల్లో శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ సుంకరి రమేష్ తెలిపారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించండి

రేగిడి: మండలంలోని వెంకటాపురంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అసిరి నాయుడు.. శిబిరానికి హాజరైన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. మెరుగైన ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు కె.రేణుక, ప్రసన్న, ఏఎన్ఎం స్వాతి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలి ఆరోగ్యంపై ఆరాతీస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు